అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్

అర్జీలపై నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వివిధ సమస్యలపై ప్రజలు అందించే వినతులపై నిర్లక్ష్యం చేయకుండా వాటిని పరిష్కరించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సూర్యనారాయణ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, ఆర్డీవో సువర్ణతో ప్రజల నుంచి 205 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు.

భూసేకరణపై.. నిరసనాగ్రహం..!

మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావును ముఖ్యమంత్రిని చేసిన నియోజకవర్గం..! రామారావు కుమారుడు నందమూరి బాలకృష్ణను మూడు సార్లు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా చేసిన నియోజకర్గం..! పసుపు జెండా రెపరెపలు తగ్గకుండా ఆపార్టీని జనం అంటిపెట్టుకున్న నియోజకర్గం..! తెలుగుదేశానికి కవచంలా ఉన్న నియోజకవర్గంలో ఆపార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే రైతుల భూములను అప్పనంగా లాగేసే కుట్ర జరుగుతోంది. రైతులకు కనీస సమాచారం ఇవ్వకుండా భూ సేకరణ చట్టం పేరుతో సాగు భూములను తీసుకునేందుకు అధికారులు సిద్ధం అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు ప్రభుత్వం, అధికారులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ

- హిందూపురం ప్రాంతంలో 2191 ఎకరాల భూసేకరణకు రంగం సిద్ధం
- సాగుభూములు ఇవ్వలేమని తెగేసి చెప్పిన అన్నదాతలు
- గతంలో సేకరించిన భూముల్లో ఏమి ఏర్పాటు చేశారంటూ నిలదీత
- అర్ధాంతరంగా సమావేశాన్ని ముగించి వెనుదిరిగిన అధికారులు

"హిందూపురం రూరల్ మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు ఆది లక్ష్మమ్మకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఐదు సంవత్సరాల క్రితం సుమారు 700 మామిడి చెట్లను నాటింది. ప్రస్తుతం ఈ చెట్లు కాపు కాసాయి. ఇలాంటి సమయంలో ఈ భూమిని పరిశ్రమల పేరుతో సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధం అయ్యింది. భవిష్యత్తు జీవనాధారం ఉంటుందని రూ.10 లక్షల ఖర్చు చేసి పంట సాగు చేసిన ఆమెకు అధికారులు భూములు తీసుకుంటామని చెప్పడంతో కన్నీటి పర్యంతం అవుతున్నారు".

హిందూపురం రూరల్ మండలం మలగూరు పంచాయతీ నందమూరి నగర్‌కు చెందిన దళిత సుంకప్ప తనకున్న ఎకరా భూమిలో పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భూసేకరణ చట్టం అస్త్రాన్ని ఉపయోగించి ఈ భూమిని తీసుకునేందుకు అధికారులు సిద్ధం అయ్యారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ.రామారావు హిందూపురం ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచిన 1985వ సంవత్సరంలో దళితుల ఆర్థికాభివృద్ధి నిమిత్తం ఒక్కొక్కరికి ఎకరా భూమి ఇచ్చారు. ప్రస్తుతం ఈ భూమిని లాక్కోనేందుకు ప్రభుత్వం చూస్తోంది.

హిందూపురం రూరల్ మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన నాగమ్మకు భర్త మరణించాడు. భర్తతో పాటు వ్యవసాయం చేసుకుంటున్న ఈమె భర్త మరణానంతరం కూడా తన పొలంలో పంటలు సాగు చేసుకుని కుటుంబానికి తోడుగా ఉంటోంది. ఉన్న ఫలంగా ఆ భూమిని భూ సేకరణ పేరుతో తీసుకుంటామని చెప్పడంతో ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి నెలకొంది.

హిందూపురం రూరల్ మండలం మలగూరు గ్రామానికి చెందిన మద్దిలేటి తనకు ఉన్న మూడు ఎకరాల భూమిలో రెండు బోర్లు వేసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. ఆ భూమిని తీసుకుంటామని ఇటీవల అధికారులు చెప్పారు. సాగులో ఉన్న భూములు తీసుకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యం అంటూ రైతు మద్దిలేటి ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి- హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం రూరల్ మండలం మలగూరు రెవెన్యూ పొలం మలగూరు, చలివెందుల, రాచపల్లి, లేపాక్షి మండలం కొండూరు, సోమందేపల్లి మండలం నడింపల్లి తదితర గ్రామాల పరిధిలో దాదాపు 1118 మంది రైతులకు చెందిన 2191 ఎకరాల భూమిని భూ సేకరణ చట్టం ద్వారా సేకరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. భూమిని దేనికోసం సేకరిస్తున్నారు..? ఎంత భూమి తీసుకుంటున్నారు..? పరిహారం ఎంత ఇస్తున్నారు..? అన్న విషయాలను ఏవీ అధికారులు రైతులకు చెప్పలేదు. అధికారులు కనీసం గ్రామసభను కూడా ఏర్పాటు చేయలేదు. మీ భూములు ప్రభుత్వం తీసుకుంటోంది.. అందుకు సంబంధించిన పత్రాలను తమకు ఇవ్వండి అంటూ అధికారులు రైతులకు చెబుతున్నారు. సోమవారం నాడు నందమూరి నగర్ సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాల అవరణంలో రెవిన్యూ అధికారులకు సమావేశం ఏర్పాటు చేసి భూమి పత్రాలు, రైతుల వివరాలు ఇవ్వాలంటూ ప్రకటించారు. ఈ విషయం విన్న వెంటనే రైతులు అధికారులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

అన్నదాతల ఆగ్రహం.. ఆందోళన

భూములు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు చెప్పగానే ఒక్కసారిగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారుల తీరును నిరసిస్తూ హిందూపురం- గోరంట్ల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ ప్రాణాలైనా వదుల ుకుంటాం.. కుటుంబ జీవనా ధారమైన సాగు భూమిని ఇచ్చేది లేదని ప్రకటించారు. భూ సేకరణ అంబానీ కోసమా...?, ఆదానీ కోసమా అంటూ రైతులు అధికారులపై తిరగబడ్డారు. రైతులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయడంతో అధికారులు చేసేది లేక అక్కడి నుంచి వెనుదిరిగారు.

తండ్రి హయాంలో భూ పంపిణీ..

కుమారుని సారథ్యంలో భూ సేకరణ..!

నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన అనంతరం 1985లో హిందూపురం ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొంది ముఖ్యమంత్రి అయ్యారు. తెలుగుదేశం, నందమూరి కుటుంబానికి ఓటమి అన్నది లేకుండా ఇక్కడి ప్రజలు గెలిపిస్తూ వస్తున్నారు. ఎన్‌టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడి రైతుల ఆర్థిక జీవన పరిస్థితులను మెరుగు పరిచేసేందుకు సాగు భూములను పంపిణీ చేశారు. ఈ భూములను తీసుకున్న దళిత, బిసి, సన్నచిన్నకారు రైతులు వాటిని చదును చేసుకుని పంటలు సాగు చేస్తున్నారు. ఆ భూమే సర్వశం అని బతుకున్నారు. ప్రస్తుతం ఎన్టీ రామారావు కుమారుడు నందమూరి బాలకృష్ణ హిందూపురానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తండ్రి హయాంలో భూమలిస్తే కుమారుని హయాంలో సాగు భూములను లాగేసుకోవడం ఏమిటంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

రైతులతో కలిసి ఉద్యమిస్తాం

సాగు భూములను ప్రభుత్వం పరిశ్రమల పేరుతో లాగేసుకోవడం సరికాదు. ఏడాదికి మూడు పంటలు పండే 2191 ఎకరాల భూమిని భూ యజమానులకు కనీస సమాచారం ఇవ్వకుండా అధికారులు ఎలా తీసుకుంటారు.? భూ సేకరణ చట్టాన్ని అనుసరించి భూమిని సేకరించాలంటే ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. తప్పని సరి భూ సేకరణ అయితే రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం, పరిశ్రమల ఏర్పాటు, అక్కడి నిర్వాసిత రైతుల కుటుంబాలకు ఉపాధి తదితర విషయాలను స్పష్టంగా తెలియ జేయాలి. ఇవేవి చేయకుండా బల వంతంగా భూములను లాక్కో వాలని చూస్తే రైతులతో కలిసి అడ్డుకుంటాం.

సిద్దారెడ్డి, రైతు సంఘం నాయకులు.

న్యాయం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

వైసీపీ ప్రభుత్వంలో వాలెంటర్ చేసిన చిన్న తప్పుకు ఓ యువకుడికి అన్యాయం జరిగిందని ఈ విషయంలో అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి లో నివాసం ఉంటున్న నాయి బ్రాహ్మణులు గంగాధర్ తండ్రి ఆరు ఏళ్ల క్రితం మృతిచెందాడన్నారు. ఆ సమయంలో రేషన్‌కార్డులో ఆయన పేరును తొలగించే బదులు ఆయన మనమడు సాయి పూజిత్ పేరును తొలగించారన్నారు. అయితే సాయి పూజిత్ పేరును రేషన్ కార్డులో నమోదు చేయించాలని ఎంత ప్రయత్నం చేసినా ఫలితం కన్పించలేదన్నారు. సాయి పూజిత్ పేరు రేషన్ కార్డులో లేనందున పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాయి పూజిత్ పేరును రేషన్ కార్డులో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే చిత్రావతి నదిలో పట్టణంలోని డ్రైనేజీ నీరు కలుస్తున్నందున నీరు కలుషితం అవుతోందన్నారు. ఈ కలుషిత నీరు పట్టణంలోని బోరు బావులకు చేరి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. వెంటనే డ్రైనేజీ పైపులను మరమ్మతులు చేయించి చిత్రావతి నదిలోకి డ్రైనేజీ నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులపై లోకాయుక్తలో ఫిర్యాదు

ప్రజాశక్తి-హిందూపురం



లోకాయుక్త కార్యాలయం వద్ద న్యాయవాది గోవిందరాజులు

హిందూపురం పురపాలక సంఘంలో అభివృద్ధి పనులు చేపడుతున్న ఇద్దరు కాంట్రాక్టర్లతో పాటు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని న్యాయవాది గోవిందరాజులు సోమవారం లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూపురం పురపాలక సంఘంలో వై ప్రభాకర్, కే బాలాజీ అనే కాంట్రాక్టర్లు చేపట్టిన మొత్తం రూ. 83,54,019 విలువైన అభివృద్ధి పనుల్లో అవినీతి అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కాంట్రాక్టర్లు జులై నెలలో వర్క్ ఆర్డర్ తీసుకుని పురపాలక సంఘానికి చెల్లించాల్సిన 1.5 శాతం ఈ ఎం డి చెల్లించలేదన్నారు. ఇవి తెలిసినప్పటికీ మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏమాత్రం చర్యలు తీసుకోలేదన్నారు. దీంతోపాటు ఉద్యోగోన్నతులు, మున్సిపల్ నిధుల దుర్వినియోగం తదితర అంశాలపై ఆధారాలతో సహా లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు గోవిందరాజులు వివరించారు.

ఖాద్రీశుడి హుండీ ఆదాయం రూ.84.94 లక్షలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ హుండీ ఆదాయాన్ని ఆలయ అధికారులు సోమవారం లెక్కించారు. 51 రోజులకు గాను నగదుగా రు.84,94,280లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అంతేకాక 6 గ్రాముల బంగారు, 500 గ్రాముల వెండి వచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి, పర్యవేక్షణాధికారి యన్.ప్రసాద్, ఆలయ సిబ్బందిచ కెనరా బ్యాంకు, మేనేజర్, బ్యాంకు సిబ్బందితో పాటు వివిధ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీలకు

నిధులు విడుదల చేయండి

ప్రజాశక్తి - మడకశిర టౌన్

కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసి రెండు నెలలు అయినప్పటికీ రాజకీయ ఒత్తిడితో నిధులు విడుదల చేయకపోవడం వల్ల పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపట్టలేకపోతున్నామని మండలంలోని పలువురు సర్పంచులు మండల సర్వసభ్య సమావేశంలో వాపోయారు. సోమవారం మడకశిర మండల కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది ఎంపిపి కవిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కొద్దిమంది సర్పంచులు మాట్లాడుతూ పంచాయతీలకు నిధులు మంజూరు చేయకపోవడం వల్ల ఏర్పడుతున్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నించగా ఎంపీడీవో సోనీ బాయ్ అందుకు అంగీకరించకుండా ఈ అంశం తిరిగి మాట్లాడదామని దాటవేశారు. ఛత్రం గ్రామపంచాయతీలో పాఠశాల భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వాసుపత్రికి గర్భిణులు ప్రసవ వేదనతో వస్తే రెఫర్ చేస్తున్నారని ఆగ్రమం వ్యక్తం చేశారు. ఇక్కడే ప్రసవాలు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులు చేతులు కడుక్కోవడానికి శానిటైజర్ ఏర్పాటు చేయాలన్నారు. సభ్యులు సమస్యల మీద మాట్లాడడానికి ప్రయత్నించిన ప్రతిసారి అధికారులు అది మళ్లీ మాట్లాడదాం అంటూ దాటవేత వేస్తూ కేవలం తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశాన్ని ముగించేశారు. ఇక ఉపాధి హామీ పథకం గురించి సంబంధిత అధికారులు తమ కార్యక్రమాల్ని వల్లివేశారే తప్ప ప్రజా ప్రతినిధుల్ని భాగస్వామ్యం చేయడంలో విఫలం చెందారు. దీంతో కదిరేపల్లి సర్పంచ్ నరసింహమూర్తి మాట్లాడుతూ పథకాలు ప్రజలకు చేరాలంటే పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఇందులో ప్రజా ప్రతినిధులకు కూడా భాగస్వామ్యం కల్పిస్తే పథకాలు ప్రజలకి మరింత చేరువలో ఉంటాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

ప్రజాశక్తి - గుడిబండ

మండలంలోని బూదిపల్లి తండాలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు సోమవారం బూదిపల్లి తండాకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఖాళీ బిందెలతో మడకశిర అమరాపురం ప్రధాన రోడ్డులో బైఠాయించారు. గ్రామంలో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంబంధిత శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఫిర్యాదుల స్వీకరణలో అధికారుల కునుకు

గ్రీవెన్స్ లో హాయిగా నిద్రపోతున్న అధికారులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రజల సమస్యల పరిష్కరించడానికి ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రతి సోమవారం కలెక్టరేట్లో కలెక్టర్, జిల్లా అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తుంటారు. అన్ని శాఖల అధికారులు ఇందులో పాల్గొంటారు. సోమవారం నాడు కలెక్టరేట్లో జరిగిన ఈ కార్యక్రమంలో కొందరు అధికారులు హాయిగా కునుకు తీశారు. ఏపీఎంఐపి పీడీ సుదర్శన్, ఎక్సైజ్ సిఐ అధికారి ఒకరు కునుకు తీస్తూ కన్పించారు. ఒకవైపు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇతర అధికారులు ఓపిగ్గా ప్రజల నుంచి వచ్చే అర్జీలను స్వీకరిస్తుంటే మరోవైపు ఇందులో హాజరైన అధికారులు కొందరు కునుకు తీశారు. మరికొందరు సెల్ఫోన్‌లో ముచ్చట్లు పెట్టుకుని కన్పించారు. సమస్యలను పరిష్కరించాల్సిన వేదికలో ఇలా అధికారులు నిర్లక్ష్యంగా నిద్రలోకి జారటం, సెల్‌ఫోన్‌లో నిమగ్నం కావడం చూసి అక్కడికొచ్చిన ఫిర్యాదుదారులు విస్మయం వ్యక్తం చేశారు.

పెనుకొండ పారిశుధ్య కార్మికుడికి స్వచ్ఛ వారియర్ అవార్డు

అవార్డు అందుకుంటున్న నగర పంచాయతీ కార్మికుడు జి చంద్ర

అవార్డు అందుకుంటున్న బిసలమనేపల్లి కార్యదర్శి

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ నగర పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుడు జి చంద్ర స్వచ్ఛ వారియర్ అవార్డును జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ల చేతులు మీదుగా సోమవారం అందుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ చంద్రకు అవార్డు రావడం అభినందనీయమన్నారు. పెనుకొండ నగర పంచాయతీకి రాష్ట్రంలోని గుర్తింపు వచ్చినందుకు గర్వంగా ఉందన్నారు.

బిసలమనేపల్లి పంచాయతీకి స్వచ్ఛఆంధ్ర అవార్డు

లేపాక్షి : మండలం పరిధిలోని బిసలమనేపల్లి పంచాయతీ జిల్లా స్థాయి లో ఉత్తమ స్వచ్ఛ ఆంధ్ర అవార్డును సొంతం చేసుకుంది. ఈ మేరకు ఆపంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు సోమవారం కలెక్టర్ శ్యాం ప్రసాద్ చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు. పంచాయతీ పరిధిలో అన్ని వీధులను పరిశుభ్రంగా ఉంచడం, చెత్త తో సంపద తయారు చేయడం, ప్లాస్టిక్ వాడకం తగ్గించే విధంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం తదితర వాటి వల్ల తమ పంచాయతీకి అవార్డు వచ్చిందని సర్పంచి నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు తెలిపారు.

గ్రామ పంచాయతీలకు జిల్లా స్వచ్ఛాంధ్ర అవార్డులు

హిందూపురం : ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా గ్రామపంచాయతీ ప్రజలకు కనీస సౌకర్యాలతోపాటు ప్రజల ఆరోగ్యం బాగు కోసం పరిశుభ్రతలో ప్రత్యేక శ్రద్ధవహించి ఇటు ప్రజల అటు అధికారుల ప్రశంసలను అందుకున్న మూడు గ్రామ పంచాయతీలు జిల్లా స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా హిందూపురం రూరల్ పరిధిలోని కిరికెర(మేజర్ పంచాయతీ), తూమకుంట, లేపాక్షి మండలంలోని బిసలమానే పల్లిపంచాయతీల్లో సర్పంచులు, కార్యదర్శులు సంయుక్తంగా పరిశుభ్రమైన నీటి సరఫరాతో పాటు డ్రైనేజీలు, వీధులు శుభ్రపరచడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయడంతో ఆ మూడు పంచాయతీలను జిల్లా స్వచ్చాంధ్ర అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో పుట్టపర్తిలో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, డిపిఒ సమత, ఎమ్మెల్యే సింధూర రెడ్డి సమక్షంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ చేతుల మీదుగా అందుకున్నారు.

కెజిబివికి స్వచ్ఛాంధ్ర అవార్డు

బత్తలపల్లి : స్వచ్ఛాంధ్ర లక్ష్యాలలో ఉత్తమ పనితీరు కనబరిచిన కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయానికి స్వచ్ఛ ఆంధ్ర జిల్లా అవార్డును ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సోమవారం పుట్టపర్తిలో ప్రభుత్వ స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాల ప్రధానోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా జిల్లా స్వచ్ఛత అవార్డు, ప్రశంసాపత్రము కేజీబీవీ ప్రిన్సిపాల్ గుల్జార్ బేగం అందుకున్నారు. మండలంలోని సంజీవపురం వద్ద నున్న కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం(కెజిబివి)లో పరిశుభ్రత అమలు జరపడంతో స్వర్ణ ఆంధ్రా- స్వచ్ఛ ఆంధ్రా జిల్లా స్థాయి అవార్డుకు ఎంపిక చేశారు. పుట్టపర్తిలోని శిల్పారామంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే పల్లె సిందూరా రెడ్డి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్,జిల్లా పంచాయతీ అధికారిణి సమతతోపాటు పలువురు హాజరయ్యారు.

భూ హక్కులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రజా పయోజనాల కోసం తమ భూమిని ప్రభుత్వం తీసుకుదని అందులో మిగిలిన భూమికి హక్కులు కల్పించి న్యాయం చేయాలని సోమందేపల్లి పల్లికి చెందిన యుడి కుళ్లాయప్ప అనే రైతు కోరారు. ఈ మేరకు ఆయన పెనుకొండ ఆర్డీవో ఆనంద్ కుమార్ కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా కుళ్లాయప్ప మాట్లాడుతూ సోమందేపల్లి పొలం సర్వే నెం. 145-1లో 4-87 ఎకరాల భూమిలో 20ఏళ్ల గా పంటసాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ భూమి లో ఇల్లు నిర్మించుకుని టెంకాయి, మామిడి , సపోట, జామ పెంచామన్నారు. అయితే ఈ భూమిని హంద్రీనీవా కాలువ, పేదల గృహాలకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం భూ సేకరణ చేసిందన్నారు. ఇందులో మిగిలిన భూమి కోసం తమకు పట్టా ఇవ్వాలని అప్పటి కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నామన్నారు. 2010లో మండల సర్వేయర్ ఒక ఎకరాకు ఎంజయ్మెంట్ స్కెచ్ ఇచ్చారని 1 ఎకరంకు రెవిన్యూ అధికారులు తన భార్య హుస్సేన్ బీ పేరుమీద పట్టా ఇచ్చారని వివరించారు. రెండు ఎకరాలు భూమి ఉంటే ఒక ఎకరాకు మాత్రమే పట్టా ఇవ్వడంతో రెండు ఎకరాలకు పట్టా ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించామని ఆయన తెలిపారు. ఈ భూమికి 1బి, అడంగల్ ఇవ్వాలని కోరితే సోమందేపల్లి రెవెన్యూ అధికారులు ఇవ్వలేదని ఆరోపించారు. దీంతో 18.06.2020న లో హైకోర్టులో పిటిషన్ వేశామని చెప్పారు. ఈనేపథ్యంలో ఆగస్టు 2025లో గొల్ల మహేష్, గొల్ల రాజ గోపాల్, గొల్ల గోపాల యాదవ, ముత్యాలయాదవ, ఓబులేశు, మైలార్ యాదవ, మరికొంతమంది వ్యక్తులు తాము అనుభవం లో ఉన్న భూమిలో కమ్యూనిటి హాల్, గుడి కడతామని అని రాత్రికి రాత్రి ఒక షెడ్ వేశారన్నారు. ఈ విషయంపై పెనుగొండ కోర్టులో కేసు వేశామని కోర్టు తీర్పు వచ్చేవరకు ఆ భూమిలో ఎలాంటి కట్టడాలు నిర్మించకుండా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్‌ను కోరినట్లు కుళ్లాయప్ప చెప్పారు. విచారణ చేసి న్యాయం చేస్తామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

చెరువుకు గండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని ఈదుల బలాపురం గ్రామ చెరువుకు సోమవారం గండిపడింది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మంచే పల్లి చెరువు మరువ పారడంతో ఆ నీళ్ల ఈదులబలాపురం చెరువుకు అధికంగా చేరాయి. దీంతో చెరువు నిండి గండి పడింది. దీంతో గ్రామస్తులు ఇసుక మూటలతో తాత్కాలికంగా గండిని పూడ్చారు. విషయాన్ని నీటిపారుదల శాఖ అధికారులకు తెలియజేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయకట్టు ప్రెసిడెంట్ కిష్టప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్ కుమార్, టిడిపి నాయకులు నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

గండిపడిన చోట ఇసుక మూటలు వేస్తున్న గ్రామస్తులు

ఈకేవైసీ తప్పనిసరి

ప్రజాశక్తి - గోరంట్ల

ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన వారు ఈ కేవైసీ చేయించుకోవాలని ఏపీవో నాగిరెడ్డి తెలిపారు. ఈ కేవైసీ చేయించుకోవడం వలన ఉపాధి పనికి వెళ్లే వారికి పని కల్పించడానికి ఆన్లైన్లో అనుమతి వస్తుందన్నారు ఈకేవైసీ చేయించుకునేవారు వారి పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్ దగ్గర సంప్రదించాలని సూచించారు.

పెన్షనర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మడకశిర పెన్షనర్స్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. ఈ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. గౌరవాధ్యక్షులుగా శాంత వీరప్ప, అధ్యక్షులుగా మల్లికార్జున, ఉపాధ్యక్షులుగా సుబ్రహ్మణ్య చారి, గణపతి, వై ప్రభాకర్, రంగయ్య, పుట్టకమప్ప, ఈశ్వరప్ప, కార్యదర్శిగా ఫక్రుద్దీన్, సహాయ కార్యదర్శులుగా మల్లికార్జున, జుబేరు తిమ్మప్ప, స్వారప్ప, సత్యనారాయణ చారి, కోశాధికారిగా రాజారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆయుష్మాన్ వైద్య కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండలంలోని తుమ్మల గ్రామంలో రూ. 20.8 లక్షల వ్యయంతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. అదేవిధంగా సంస్కృతి సేవాసమితి ఆధ్వర్యంలో వైదేహి సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ సహకారంతో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని అన్నారు

విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - తలుపుల

మండల పరిధిలోని పొలతల వాండ్లపల్లి పంచాయతీ, దేవరపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూలర్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యాసామాగ్రిని అందజేశారు. ఈసందర్భంగా ట్రస్టు సభ్యుడు మన్సూర్ మాట్లాడుతూ ఫ్రెండ్స్ ట్రస్ట్ పేదవారికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ప్రకాష్ రెడ్డి, షామీర్, బావాజీ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు ఇవ్వకుండా అడ్డుకోవడం అన్యాయం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల అయ్యాయని అయితే వైసీపీ సర్పంచులకు ఆ నిధులు ఇవ్వకుండా మంత్రి సవిత, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు రాజకీయం చేస్తున్నారని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఆరోపించారు. ఈ మేరకు ఆమె సోమవారంకలెక్టరేట్లో కలెక్టర్ శ్యాం ప్రసాద్ కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆ నిధులను వైసిపి సర్పంచులకు అందకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు టిడిపి సర్పంచులకు సహకరించి ప్రతి బిల్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పుడు చూస్తే టిడిపి కండువాలు కప్పుకొని వస్తేనే నిధులు మంజూరు చేయిస్తామని మంత్రి, ఎమ్మెల్యే చెం ఎంఎస్ రాజు, సవిత తమ వైఖరి మార్చుకోవాలని సూచించారు. ఈ విషయమై కలెక్టరేట్లో కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని కలెక్టర్ సానుకూలంగా స్పందించి న్యాయం జరిగే విధంగా చూస్తామని చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో మడకశిర వైసీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప, పలువురు సర్పంచులు, ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రైతులకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువు గ్రామంలో సత్యసాయి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ ఈ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ఎకరా స్థలంలో రూ.4 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 33 / 11 నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిరంతరం నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ లో వోల్టేజ్ సమస్య తలెత్తకుండా విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ శివరాం, డీఈ కన్స్ట్రక్షన్ శ్రీధర్, ఈవోఆర్డీ ఇందిరా, ఏవో శ్రీవాణి, కూటమి నాయకులు విజయ కుమార్, శ్రీరామ్ రెడ్డి, సామకోటి ఆదినారాయణ, ఆదినారాయణ రెడ్డి, బొమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

ప్రజాశక్తి - బత్తలపల్లి

బత్తలపల్లి మండల క్లస్టర్ ఇన్ ఛార్జ్ సురేంద్ర నాయుడు కిడ్నీ సంబంధిత ఆపరేషన్ తర్వాత ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సురేంద్రనాయుడిని ఆయన నివాసంలో సోమవారం పరామర్శించారు. ఈసందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ముల్లగూరు అయ్యప్ప, యర్రాయిపల్లి సుబ్బరాయుడు, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డును వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి : వైసిపి

పోలీసుస్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - గోరంట్ల

గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న ప్రియాంక ను వేధించిన కారు డ్రైవర్లు మైనుద్దీన్, షఫీ పై చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకురాలు, మాజీమంత్రి ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ముందు వైసిపి కార్యకర్తలతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ మహిళా హోంగార్డు ప్రియాంకను వేధించిన వారిపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని సీఐ శేఖర్‌ను ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని విమర్శించారు. హోంగార్డుకు న్యాయం జరిగే వరకూ పార్టీ తరపున పోరాటం చేస్తామని చెప్పారు. మహిళా హోంగార్డుకే రక్షణ లేకపోతే ఇక సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. హోంగార్డ్ ప్రియాంకకు న్యాయం జరగకపోతే ఢిల్లీలో ఎస్టీ కమిషనకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ వెంకటేష్, నాయకులు రఘురాం రెడ్డి, శంకర్ నాయక్, మాజీ ఉప సర్పంచి శ్రీనివాసులు, అఖిలభారత బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి : వ్యకాసం

స్థానిక పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న ప్రియాంకపై వేధింపులకు పాల్పడిన కారు డ్రైవర్లు మైనుద్దీన్, షఫీపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు ఈ సందర్భంగా పాలసముద్రం సిపిఎం కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు స్వర్ణలత మాట్లాడుతూ హోంగార్డు ప్రియాంకపై కార్ డ్రైవర్లు వేధింపులకు పాల్పడటంతో ప్రియాంక మానసికంగా కుంగిపోయిందన్నారు. మనస్థాపానికి గురై ఆత్మహత్యయత్నానికి పాల్పడిందన్నారు. వేధింపులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హోంగార్డు కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జ్యోతమ్మ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండా వెంకటేష్, అంజలీదేవి, అశ్వర్థమ్మ, అచ్చమ్మ, లక్ష్మీనరసింహ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

160 చెరువులను నింపుతాం

ప్రజాశక్తి - మడకశిర టౌన్

మడకశిర నియోజకవర్గంలోని 160 చెరువులను హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణాజలాలతో నింపుతామనిఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. మండలంలోని మనూరు చెరువుకు కృష్ణా జలాలు రావడంతో సోమవారం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తో కలిసి జల హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. హంద్రీనీవా బైపాస్ కెనాల్ ద్వారా నియోజకవర్గంలో చెరువు లను నింపేందుకు కృషి చేస్తామన్నారు. సరిహద్దుకు చివరి గ్రామం వరకు నీరును తీసుకెళ్తామని తెలిపారు. అమరాపురానికి కృష్ణాజలాలు తీసుకెళ్లి ముఖ్యమంత్రి ఆహ్వానించి జల హారతి కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ నాగరాజు, మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జలహారతి కార్యక్రమంలో ఎమ్మెల్యే, తదితరులు

ఆశాల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఎంహెచ్ఒ డిప్యూటీ అధికారి నాగేంద్ర నాయక్ కు అందజేశారు. ఈసందర్భంగా ఆశ వర్కర్ల జిల్లా గౌరవాధ్యక్షులు సాంబశివ, జిల్లా ప్రధాన కార్యదర్శి సౌభాగ్య మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వ సెలవులు మంజూరు చేయాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వలన కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు విలేజ్ కి క్లినిక్లలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆశ వర్కర్లను పనిచేస్తున్నారని , పని ఒత్తిడి వలన వారు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఆశాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాధా ముంతాజ్, శబరి ,రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సమస్యలపై ప్రజాప్రతినిధులు గళం విప్పేరా..!

ఎంపీడీవో కార్యాలయం

ప్రజాశక్తి - చిలమత్తూరు

ప్రజల సమస్యలకు పరిష్కారం దొరకుతుందన్న ఆశతో ఎదురుచూస్తున్న చిలమత్తూరు మండల ప్రజల దృష్టి మంగళవారం జరగబోయే మండల పరిషత్ సర్వసభ్య సమావేశంపై నిలిచింది. మూడు నెలలకు ఒకసారి జరిగే ఈ సమావేశం గతంలో కేవలం నామమాత్రంగా నిర్వహిస్తుండటం వల్ల ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు గైర్హాజరుకావడం, హాజరైన వారు సంతకాలు చేసి వెళ్లిపోవడం లాంటి పరిస్థితులు మళ్లీ పునరావతమవుతాయా అనే సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది. మండల వ్యాప్తంగా పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. వీధి లైట్లు పనిచేయకపోవడం, డ్రెయినేజీ సమస్యలు, తాగునీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ శాఖలోనూ ఇబ్బందులు కొనసాగుతున్నాయి. ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉండటం కారణంగా రైతులు తమ పనులు సకాలంలో కాకపోవటంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అలసట చెందుతున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు జరిగిన ఏ సర్వసభ్య సమావేశంలోనూ ప్రజా సమస్యలపై సీరియస్‌గా చర్చ జరగలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ సమావేశంలో అయినా ప్రజల సమస్యలకు సమాధానాలు దొరుకుతాయా? లేక మళ్లీ నివేదికల పఠనంతోనే ముగుస్తుందా? అన్నది చర్చనీయాంశంగా మారింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం జరగనుందని ఎంపీడీవో రమణమూర్తి తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తప్పనిసరిగా హాజరై, ప్రజల సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఆయన కోరారు.

చేనేతలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి- సోమందేపల్లి

చేనేతలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని చేనేత సంఘం నాయకులు కోరారు. మండల కేంద్రంలోని షిరిడీ నగర్ నందు చేనేత కార్మికుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు ఈ సమావేశంలో జిల్లా నాయకులు శీలా నారాయణస్వామి మాట్లాడుతూ కూటమి ఎన్నికల హామీలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. చేనేతలకు 200, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇస్తామని ప్రకటించి రెండునెలలు కావస్తున్నా నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. తమ ఎలాంటి జీవో కూడా ప్రభుత్వం నుండి రాలేదని అధికారులు చెబుతున్నారన్నారు. 2018 సంవత్సరంలో అమలు చేసిన చేనేతలకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్ మాత్రమే నేటికీ అమలు అవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు దేవాంగ వెంకటేశులు, మంతూరి ఈశ్వర్, పురుషోత్తం, కుమ్మర కిష్టప్ప, సంజీవప్ప, శ్రీరాములు, గోవిందప్ప, రమేష్, పటేకర శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది వైఖరికి నిరసనగా రాస్తారోకో

ప్రజాశక్తి - గాండ్లపెంట

ఆర్టీసీ సిబ్బంది వైఖరికి నిరసనగా మండల పరిధిలోని కదిరి రాయచోటి రహదారి రహదారి వేపరాళ్ల వద్ద పలు గ్రామాల ప్రజలు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. వేపరాళ్ల, సిఎం తండా, తాళ్లకాల్వ దళితవాడ తదితర గ్రామాల ప్రజలు, మహిళలు, విద్యార్థులు రోడ్డుకు అడ్డంగా రాళ్లు వేసి రెండుగంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ రహదారి మీదుగా వెళ్లే దాదాపు ప్రతి బస్సును ఆపకుండా వెళ్ళిపోతున్నారని వాపోయారు. విద్యార్థులు, ప్రజలు పట్టణానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. బస్సులను ఆపాలని ఆర్టీసీ డ్రైవర్లకు వేడుకుంటున్నా వారు ఇష్టానుసారంగా బస్సులను ఆపకుండా వెళ్ళిపోతున్నారని విమర్శించారు. విద్యార్థులు సమయానికి పాఠశాలలకు, కళాశాలలకు చేరుకోవాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు చెప్పినా వారు పట్టించుకోవటం లేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తాము రోడ్డెక్కాల్సి వచ్చిందని అన్నారు.

డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలి : కెవిపిఎస్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - గోరంట్ల

డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జ్యోతమ్మ అధ్యక్షతన గోరంట్ల మండల కేంద్రంలోని అంబేద్కర్‌విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. సర్కిల్ నుండి డప్పు కళాకారులు డప్పుల వాయిస్తూ తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా చేరుకొని అనంతరం ధర్నా నిర్వహించడం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హనుమయ్య, రమణ మాట్లాడుతూ డప్పు కళాకారులు దశాబ్దాలుగా డప్పు వత్తి మీద ఆధారపడి జీవనం చేస్తున్నారన్నారు.. ప్రభుత్వ పథకాల అమలు , గ్రామసభలు నిర్వహించడంలో డప్పు కళాకారులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. డప్పు కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 2019 నుండి 2024 వరకు బకాయి ఉన్న డప్పులు , గజ్జలు , యూనిఫారం తక్షణం ఇవ్వాలన్నారు. డప్పు కళాకారులు పింఛను దరఖాస్తు చేసుకోవడానికి ఆన్లైన్ ఓపెన్ చేయాలన్నారు. భూమిలేని డప్పు కళాకారుల కుటుంబానికి 2 ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జూనియర్ అసిస్టెంట్ ప్రదీప్‌కి సమర్పించారు. అనంతరం డప్పు కళాకారుల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వెంకట రాముడు, కార్యదర్శిగా నాగప్ప, కమిటీ సభ్యులుగా నాగరాజు , రామచంద్ర , గంగాద్రి, నాగేష్ , నారాయణప్ప , రామకృష్ణ తదితరులను ఎన్నుకున్నారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-హిందూపురం

ఈనెల 10వ తేదీన పట్టణం లోని ఎస్ డి జి ఎస్ కళాశాల ఆవరణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పిఏలు డాక్టర్ సురేంద్ర, బాలాజీ, మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున కోరారు. ఈ మేరకు వారు సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో జాబ్ మేళాకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ జాబ్ మేళాలో దాదాపు 15 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు హాజరు అవుతారన్నారు. పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లమా, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీలతోపాటు బీటెక్ క్ పూర్తిచేసుకుని 18- 35 మధ్య వయసు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిఎస్ చంద్రమ్మ, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శివప్రసాద్, చేనేత జౌలి శాఖ ఏడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాడిమర్రిలో జలధి పూజ

ప్రజాశక్తి -తాడిమర్రి

మండల కేంద్రంలో కోటి రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించినటువంటి శ్రీ ఆరవేడు పట్నం పెద్దయ్య స్వామి గుడి ప్రారంభోత్సవం జల్ది పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆరవేటి కాటమయ్య, పూజారప్ప శివయ్య, ఎల్లప్ప తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడతూ ఉమ్మడి అనంతపురం జిల్లా నుండి దాదాపుగా 25 గుడి కట్ల స్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలకు ఎంపీ పార్థసారథి, మాజీ మంత్రి శంకరనారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, బీసీ కార్పొరేషన్ పాల్యం కాటమయ్య, మంత్రి సవిత, జబ్బల శ్రీనివాసులు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఎస్ఐ కృష్ణవేణి యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

భూ రీసర్వేను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని పి నరసాపురం పంచాయతీలో చేపట్టనున్న భూ రీసర్వేను భూ యజమానులు వినియోగించుకోవాలని తహశీల్దార్ హసీనా సుల్తానా పిలుపునిచ్చారు. సోమవారం గ్రామంలో పర్యటించిన ఆమె రీ సర్వే పై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు అనంతరం జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి వ్యక్తికి రీ సర్వే చాలా ఉపయోగకరమని ప్రతి ఒక్కరూ రీ సర్వేకు సహకరించాలని కోరారు. రైతుకు అనుగుణంగా వారికి కేటాయించే రోజులలో తప్పనిసరిగా నోటీసుకు స్పందించి అధికారులకు అందుబాటులో ఉండాలన్నారు. నరసాపురం పంచాయతీలో ప్రభుత్వ భూమి 86.54 ఎకరాలు ఉండగా, పట్టా భూమి 1228.62, డీకేటి భూమి 528.65 ఎకరాలు, దేవాదాయ భూమి 4.31 ఎకరాలు ఉన్నట్లు వెల్లడించారు. ఆన్లైన్లో ఉన్న భూములకు మాత్రమే రీసర్వే జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే ఉప తహశీల్దార్ శోభ, మండల సర్వేయర్ హరీష్, వీఆర్వోలు రామాంజి, గంగాధర్, శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ ఎస్ఎన్ గోవింద్ రెడ్డి, మండల అభివృద్ధి కమిటీ సభ్యులు సర్పంచి బాలాజీ సోమప్ప, నరసాపురం గోవింద్ రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికాలేదని ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణం లోని కోటకు చెందిన మహేష్ (38) అనే యువకుడు సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎన్ని పెళ్లి సంబంధాలు చూసిన పెళ్లి కావడం లేదనిమనస్థాపానికి గురై సోమవారం తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు ఇనుప సామాన్ల అంగడిలో పని చేస్తాడని వారు తెలిపారు. ఈ ఘటనపై ఒకటో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం, చిగిచెర్ల గ్రామాల మధ్యలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు గాయాలు అయ్యాయి. పుట్టపర్తి కి చెందిన హబీబుల్లా, రాజేష్ అనే యువకులు ఇద్దరు ద్విచక్ర వాహనంలో సోమవారం పుట్టపర్తి నుండి అనంతపురానికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా ధర్మవరం మండలం గొల్లపల్లి గ్రామం దాటిన తర్వాత కొద్ది దూరంలో, చిగిచెర్ల వైపు నుండి ధర్మవరం కు వచ్చే ఒక ఆటో వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో హబీబుల్లా, రాజేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హబీబుల్లా, రాజేష్ పుట్టపర్తి సమీపంలో ఉన్న మంగళకర కాలేజీలో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్నారని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

కిరికెరలో చోరీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని కిరికిరిలో నివాసం ఉంటున్న ఎడ్విన్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. దసరా సెలవుల నిమిత్తం బంధువుల ఇంటికి వెళ్లిన ఎడ్విన్ కుటుంబం సోమవారం ఇంటికి రాగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న 13 గ్రాముల బంగారు, 10 తులాల వెండిని గుర్తుతెలియని దుండగులు దోచుకెళ్లారు. ఈ విషయాన్ని బాధితుడు హిందూపురం రూరల్ అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని ముండ్లవారిపల్లి నుండి ఎనుములవారిపల్లికి వెళ్లే దారిలో పాపాగ్ని నది పరివాహక ప్రాంతంలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అమడగూరు మండలంల పూలకుంటపల్లికి చెందిన వెంకటప్ప (60) పది సంవత్సరాలుగా తనకల్లు మండలం కొక్కంటి క్రాస్ లో నివసిస్తూ, ఎవరైనా పిలిస్తే వంట పనులలో సహాయకుడిగా పనిచేసేవాడు. అలాగే స్థానిక హోటళ్లలో చిన్నపాటి పనులు చేస్తూ వచ్చిన డబ్బుతో మద్యం తాగేవాడు. ఇతడికి భార్య, పిల్లలు, బంధువులు లేరు. శనివారం ఉదయం ముండ్లవారిపల్లి నుండి ఏనుములవారిపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో పాపాగ్ని నది పక్కన వెంకటప్ప మృతదేహాన్ని స్థానికులు గమనించి రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. కోటపల్లి వీఆర్వో ఎం. గంగాధర్, ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. వెంకటప్ప మృతికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉందని తనకల్లు ఎస్ఐ గోపీ తెలిపారు.

ఎంపీడీవోగా ఆనంద ప్రసాద్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల ఎంపిడిఒగా ఆనంద ప్రసాద్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ సరస్వతి ఉద్యోగోన్నతిపై కడప జిల్లాకు వెళ్లారు. బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ శివకుమార్, పలువురు పంచాయితీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

'బాలయేసు' విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

ప్రజాశక్తి-హిందూపురం

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో గత విద్యా సంవత్సరం ఫలితాల్లో బాల యేసు జూనియర్ కళాశాలకు చెందిన సీమ సాదియా వెయ్యి మార్కులకు గాను 988 మార్కులు సాధించింది. రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంకు సాధించిన ఆ విద్యార్థినికి ప్రోత్సాహం కింద ల్యాప్ టాప్ అందజేశారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ యం.బలరామి రెడ్డి, ప్రిన్సిపల్ యం.శౌరి రెడ్డి ల్యాప్ టాప్ ను బహుమతిగా అందజేసి రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు సాధించి బాల యేసు కళాశాల కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేయడం పట్ల విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన

ప్రజాశక్తి - రొద్దం

జిఎస్‌టి తగ్గింపులో కలిగే ప్రయోజనాలపై స్థానిక మహాత్మ జ్యోతిరావు బాపూలే పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల కేంద్రం లోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్‌పై సోమవార అవగాహన కల్పించారు. వ్యవసాయం పనిముట్లు కొనుగోలు చేస్తే డబ్బును ఏ విధంగా పొదుపు చేయవచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, ఎంపిడిఒ నరసింహ మూర్తి, టీడీపీ మండల కన్వీనర్ అభిలాష్, సింగిల్ విండో అధ్యక్షులు నరసింహప్ప, పంచాయతీ సెక్రటరీ నాగరాజు, మండల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని పెనుగొండ పావగడ ప్రధాన రహదారిలో ఆర్. మరవ పల్లి కల్వర్టు పక్కన ఏర్పడిన పైపులైన్ లీకేజీని అధికారులు అరికట్టారు. ఈ మేరకు ఈవోఆర్డీ గోవిందప్ప ఆధ్వర్యంలో సోమవారం పైపులైనుకు మరమ్మతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీతో పాటు గోవిందప్ప, పంచాయతీ సిబ్బంది రఫిక్, పంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణ అవసరం

ప్రజాశక్తి-హిందూపురం

విద్యా బోధనలతో పాటు క్రమశిక్షణ, సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో ముఖ్యమని నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఎస్సీఆర్టీ పరిశీలకులు డాక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. గత మూడు రోజులుగా హిందూపురం సమీపంలోని బిట్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న శిక్షణా తరగతులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ శిక్షణలో ఎంఇఒలు గంగప్ప, శేషాచలం, లక్ష్మీదేవి, ఎస్.ఆర్.బాబా, భారత్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధి డాక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - రొద్దం

స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వాల్మీకులు సమాజంలో అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, హిందూపురం మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి అంజనేయులు, రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ డైరెక్టర్ బంగారు కృష్ణమూర్తి, మాజీ వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, సోమందేపల్లి ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, హిందూపురం పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు కుంటిమద్ది రంగయ్య, కోనాపురం ఈశ్వరయ్య, ముదిగుబ్బ కొట్టాల శ్రీరాములు, మాజీ జెడ్పిటిసిలు సూర్యనారాయణ, చిన్నప్పయ్య, టిడిపి మండల కన్వీనర్ నరహరి, వైసిపి మండల కన్వీనర్ తిమ్మయ్య, టీడీపీ సీనియర్ నాయకులు మాధవ నాయుడు, వెంకట్రామిరెడ్డి, సోమందేపల్లి నీరు గంటి చంద్ర, బెల్లాలచెరువు చంద్ర, అడ్వకేట్ హరి,వీరాంజి,చిరంజీవి, మాజీ ఎంపీటీసీ చెన్నకేశవులు, డీలర్ల సంఘం అధ్యక్షులు సిద్దన్న పాల్గొన్నారు.